సెన్సెక్స్ @ 85000

- 26వేలకు నిఫ్టీ
- తొలిసారి తాకిన సూచీలు
- ఒడిదొడుకులతో నిలువని లాభాలు
- మిశ్రమంగా ముగిసిన మార్కెట్లు
- నష్టాల్లో ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లు

ముంబై, సెప్టెంబర్ 24: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం సరికొత్త స్థాయిలను తాకాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ తొలిసారి 85,000 మార్కును దాటింది. ఒకానొక దశలోనైతే 234.62 పాయింట్లు పుంజుకొని 85,163.23 వద్దకు చేరింది. అయినప్పటికీ అమ్మకాల ఒత్తిడితో చివరకు 14.57 పాయింట్లు పడిపోయి 84,914.04 దగ్గర స్థిరపడింది. దీంతో వరుస మూడు రోజుల లాభాల పరుగులకు బ్రేక్ పడినట్టైంది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా మొదటిసారి 26,000 మార్కును అధిరోహించింది. ఇంట్రా-డేలో 72.5 పాయింట్లు ఎగిసి 26,011.55 పాయింట్లకు వెళ్లింది. అయితే లాభాల స్వీకరణ కారణంగా కిందికి రాక తప్పలేదు. ఆఖర్లో 1.35 పాయింట్లు పెరిగి 25,940.40 వద్ద నిలిచింది. నిఫ్టీకిదే గరిష్ఠ ముగింపు కావడం గమనార్హం.

తీవ్ర ఆటుపోట్ల మధ్య..

స్టాక్ మార్కెట్లు ఆల్‌టైమ్ హై రికార్డుల వద్ద ఉండటంతో మదుపరులు ఊగిసలాటకు గురయ్యారు. ఈ క్రమంలోనే కొనుగోళ్లు, అమ్మకాల మధ్య సూచీలు తీవ్ర ఒడిదొడుకులకు లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 84,716.07 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఎఫ్ఎంసీజీ, కొన్ని బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. అయితే చైనా తమ దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపర్చడానికి ప్రకటించిన ఉద్దీపనలతో మెటల్ షేర్లకు గిరాకీ కనిపించింది. కానీ హిందుస్థాన్ యునిలివర్, అల్ట్రాటెక్ సిమెంట్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, టైటాన్, నెస్లే, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు భారీగా నష్టపోవడం సెన్సెక్స్‌కు లాభాలను దూరం చేసింది.

రంగాలవారీగా చూస్తే.. ఎఫ్ఎంసీజీ, టెలికం, సర్వీసెస్, ఆర్థిక సేవలు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, బ్యాంకింగ్ షేర్లు 0.75 శాతం నుంచి 0.30 శాతం వరకు క్షీణించాయి. కాగా, మెటల్, పవర్, యుటిలిటీస్, కమోడిటీస్, ఇండస్ట్రియల్స్ షేర్లు 1.38 శాతం నుంచి 0.47 శాతం మేర పుంజుకున్నాయి. అలాగే బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.21 శాతం, స్మాల్‌క్యాప్ 0.04 శాతం పెరిగాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. షాంఘై, హాంకాంగ్ సూచీలు భారీ ఎత్తున పెరగడం విశేషం. ఐరోపా మార్కెట్లలోనూ బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ సూచీలు లాభాల్లోనే కదలాడుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపట్ల ఆసక్తినే కనబరుస్తున్నారు. 'అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలు.. దేశీయ స్టాక్ మార్కెట్లను రికార్డుల్లో నడిపిస్తున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ అధిపతి వినోద్ నాయర్ అన్నారు. చైనా సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలు, ఆ దేశ ఉద్దీపనలు కూడా విదేశీ మదుపరులను పెట్టుబడుల వైపు తీసుకెళ్తున్నాయని అభిప్రాయపడ్డారు.

IIFL FINANCE

ఒక్క శాతం వడ్డీకే గోల్డ్ లోన్

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ప్రత్యేక ఆఫర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24: దేశంలో అతిపెద్ద నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవలు అందిస్తున్న సంస్థల్లో ఒకటైన ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ మళ్లీ బంగారం రుణాలు ఆరంభించింది. మూడు నెలల క్రితం రిజర్వు బ్యాంక్ నిషేధం విధించడంతో రుణాలను నిలిపివేసిన సంస్థ..ఇటీవల సెంట్రల్ బ్యాంక్ తిరిగి అనుమతించడంతో మళ్లీ యథావిధిగా సేవలు ప్రారంభించింది. ఇదే అదనుగా కస్టమర్లను ఆకట్టుకోవడానికి 'గోల్డ్ లోన్ మేళా' పేరుతో ప్రత్యేక స్కీం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీం కింద కేవలం ఒక్క శాతం వడ్డీకే గోల్డ్ లోన్లను మంజూరు చేయనున్నట్లు ఐఐఎఫ్ఎల్ గోల్డ్ లోన్ హెడ్ సౌరభ్ కుమార్ తెలిపారు. అలాగే ప్రాసెసింగ్ ఫీజును కూడా ఎత్తివేసినట్లు చెప్పారు. ఈ నెల 30 వరకు ఈ ప్రత్యేక ఆఫర్ అందుబాటులో ఉండనున్నదని వెల్లడించింది.

విద్యార్థులకు గేమింగ్ జోన్

హైదరాబాద్, సెప్టెంబర్ 24: విద్యార్థులకు కృత్రిమ మేధస్సు ఆధారిత గేమింగ్ జోన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది ఇంటెల్ ఇండియా. విశాల్ పెరిఫెరల్స్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఈ గేమింగ్ జోన్‌లో విద్యార్థులు ఉచితంగా వినియోగించుకోవచ్చును. నగరంలో ఏర్పాటు చేసిన తొలి గేమింగ్ జోన్ ఇదే కావడం విశేషం. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వహకులు తెలిపారు. ఇందులో అత్యాధునిక స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కంప్యూటింగ్ టూల్స్‌తోపాటు ప్రోగ్రామింగ్, ఏఐ డెవలప్‌మెంట్, గేమింగ్ రంగాలకు చెందిన విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకునేందుకు దోహద పడుతుందన్నారు.

'ప్రైవేట్‌లో రుణాలకు డిమాండ్'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: దేశవ్యాప్తంగా కార్పొరేట్ రుణాలకు అధికంగా డిమాండ్ ఉన్నదని, రూ.4 లక్షల కోట్ల విలువైన రుణాలు తీసుకోవడానికి సంస్థలు రెడీగా ఉన్నట్లు ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగంలో ప్రైవేట్ రంగం అంచనాలకుమించి రాణించే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. రోడ్లు, రెన్యూవబుల్ ఎనర్జీ, రిఫైనరీ విభాగాల నుంచి రుణాలకు డిమాండ్ ఉందన్నారు.

టాటా నెక్సాన్ సీఎన్‌జీ వెర్షన్

ప్రారంభ ధర రూ.8.99 లక్షలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: దేశీయంగా ఎస్‌యూవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని టాటా మోటర్స్ సరికొత్త మాడళ్లను మార్కెట్‌కు పరిచయం చేసింది. నెక్సాన్ విభాగంలోనే సీఎన్‌జీ, సరికొత్త 45 కిలోవాట్ల బ్యాటరీతో నెక్సాన్ ఈవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నయా ఈవీ వేగవంతంగా చార్జింగ్ అవడమే కాకుండా పలు నూతన ఫీచర్లతో తీర్చిదిద్దిన ఈ మాడల్ రూ.13.99 లక్షల నుంచి రూ.17.19 లక్షల లోపు లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. అలాగే టర్బో చార్జర్ సీఎన్‌జీ వాహనం రూ.8.99 లక్షల ప్రారంభ ధరతో లభించనున్నది. దీంతో టాటా నెక్సాన్ అన్ని రకాలు పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ విభాగంలో లభించిన తొలి మాడల్ ఇదే కావడం విశేషం. 45 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈవీ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 350 నుంచి 370 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. ఈ సందర్భంగా టాటా ప్యాసింజర్ విభాగ చీఫ్ కమర్షియల్ అధికారి వివేక్ శ్రీవాత్సవ మాట్లాడుతూ..ఏడేండ్ల క్రితం దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన నెక్సాన్ ఇప్పటి వరకు ఏడు లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

పెరిగిన ఎన్ఎండీసీ ఉత్పత్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: ఇనుప ఖనిజ ఉత్పత్తి సంస్థ ఎన్ఎండీసీ గడిచిన ఆర్థిక సంవత్సరంలో మెరుగైన పనితీరు కనబరిచింది. ఖనిజ ఉత్పత్తిలో 10 శాతం పెరిగి 45 మిలియన్ టన్నులకు చేరుకోగా, అమ్మకాలు 16 శాతం అధికమై 44.48 మిలియన్ టన్నులకు చేరుకున్నట్లు కంపెనీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. 2022-23లో 257 మిలియన్ టన్నులు ఖనిజాన్ని ఉత్పత్తి చేసిన సంస్థ..ఆ మరుసటిఏడాది 275 మిలియన్ టన్నులకు పెరిగినట్లు ఆయన వెల్లడించారు.

శంఖ్ ఎయిర్ వస్తోంది

దేశీయ మార్కెట్‌లోకి మరో కొత్త ఎయిర్‌లైన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: దేశీయ మార్కెట్‌లోకి కొత్త విమానయాన సంస్థ రాబోతున్నది. త్వరలో శంఖ్ ఎయిర్ విమాన సర్వీసులు మొదలు కాబోతున్నాయి. కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ నుంచి ఇందు కోసం శంఖ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతులు కూడా లభించాయి. మూడేండ్ల కాలపరిమితితో ఈ ఎయిర్‌లైన్‌కు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ)ను జారీ చేశారు. సెబీ, ఎఫ్‌డీఐ నిబంధనల్ని పాటించాలని కూడా స్పష్టం చేసింది. అయితే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి క్లియరెన్స్‌లు రావాల్సి ఉన్నది. ఇది వస్తే శంఖ్ ఎయిర్ విమానాలు ఎగురుతాయి. కాగా, తొలి విమాన సర్వీసు ఉత్తరప్రదేశ్ నుంచి ప్రారంభం కానున్నది. లక్నో, నోయిడాలు కేంద్రంగా ఇది విమానయాన కార్యకలాపాలు నడుపనున్నది.

10,700 బోగస్ కంపెనీలు

రూ.10వేల కోట్లకుపైగా ఎగవేతలు • గుర్తించిన జీఎస్టీ అధికారులు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) కింద దాదాపు 10,700 నకిలీ రిజిస్ట్రేషన్లను అధికారులు గుర్తించారు. ఇవన్నీ రూ.10,179 కోట్ల పన్ను ఎగవేసినట్టు తేల్చారు. దేశవ్యాప్తంగా నకిలీ రిజిస్ట్రేషన్లతో పుట్టుకొచ్చిన బోగస్ కంపెనీల గుట్టు రట్టు చేసేందుకు జీఎస్టీ అధికారులు ఓ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఖజానాకు నష్టం చేకూరుస్తున్న మోసగాళ్ల పని పట్టేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగుచూస్తుండటం గమనార్హం. ప్రస్తుతం జరుగుతున్న రెండో విడుత డ్రైవ్.. అక్టోబర్ 15దాకా ఉండనున్నది. కాగా, 12 రాష్ట్రాల్లో ఆధార్ ఆధారిత జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను అమల్లోకి తెచ్చామని, వచ్చే నెల 4కల్లా మరో నాలుగు రాష్ట్రాల్లోనూ మొదలవుతుందని పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్ర బోర్డు (సీబీఐసీ) సభ్యుడు శశాంక్ ప్రియ తెలిపారు. అసోచామ్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. రిస్క్ ప్రొఫైల్ ఆధారంగా కొత్త ట్యాక్స్ పేయర్స్‌పై కొన్ని ఆంక్షలు సైతం పెడుతున్నట్టు చెప్పారు. నెలలో ఎన్ని ఇన్వాయిస్‌లు జారీ చేస్తున్నారన్న దానిపైనా దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. అధికారులు 67,970 జీఎస్టీఐఎన్‌లను గుర్తించారని, ఇందులో ఈ నెల 22 నాటికి 39,965 జీఎస్టీఐఎన్‌లను వెరిఫై చేశామని పేర్కొన్నారు. కాగా, రిటైలర్ల కోసం జీఎస్టీ ఈ-ఇన్వాయిసింగ్ అమలుకుగాను తెస్తున్న ఆర్కిటెక్చర్ డిజైన్ దాదాపు సిద్ధమైందని జీఎస్టీ నెట్‌వర్క్ సీఈవో మనీశ్ కుమార్ సిన్హా తెలిపారు. త్వరలోనే బీ2సీలో దీన్ని తెస్తామన్నారు. అంతకుముందు పైలట్ ప్రాజెక్టుగా ఆచరణలోపెట్టి పరిశీలించనున్నట్టు అసోచామ్ కార్యక్రమంలో సిన్హా వెల్లడించారు.

అక్టోబర్‌లో హ్యుందాయ్ 25వేల కోట్ల ఐపీవో!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు లైన్ క్లియరైంది. దాదాపు 3 బిలియన్ డాలర్ల (రూ.25,000 కోట్లు) నిధుల సమీకరణే లక్ష్యంగా వస్తున్న ఈ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) దేశంలోనే అతిపెద్దది కానున్నది. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ.. ఈ మెగా ఐపీవోకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. ఈ ఏడాది జూన్‌లో ఐపీవో కోసం సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)ను హ్యుందాయ్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఇప్పటిదాకా దేశ చరిత్రలో ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ ఐపీవోనే అతిపెద్దది. దీని విలువ 2.7 బిలియన్ డాలర్లు. హ్యుందాయ్ పబ్లిక్ ఇష్యూ వస్తే దీన్ని అధిగమించనున్నది.

బ్యాంకుల అక్రమాలపై విచారణ

పలు చిన్నచిన్న ఐపీవోల నిర్వహణలో పాలుపంచుకున్న 6 స్థానిక ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించిన సెబీ.. ఆ వ్యవహారంపై విచారణ చేస్తున్నది. ఆయా ఐపీవోల్లో సేకరించిన నిధుల్లో 1-3 శాతానికి బదులుగా 15 శాతం ఫీజులు ఇవి తీసుకున్నట్టు తెలుస్తున్నది.

IndiGo

ఒకేసారి ఆరు డైరెక్ట్ ఫ్లైట్లు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 24: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో.. హైదరాబాద్ నుంచి ఒకేసారి ఆరు రూట్లలో విమాన సేవలు ప్రారంభించింది. మంగళవారం శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అగర్తాల, జమ్ము, ఆగ్రా, కాన్పూర్, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లకు నేరుగా విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశీయ విమాన కనెక్టివిటీ పెంచడంలో భాగంగా ఒకేసారి ఈ ఆరు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పణికర్ వెల్లడించారు. నూతన రూట్లలో విమాన సర్వీసులు అందించడానికి ఎయిర్‌పోర్ట్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ఇక్కడి నుంచి అంతరాయం లేకుండా ప్రయాణాన్ని మరింత సులభతరం చేశామని వివరించారు.